వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాలకు బాసట

- నియోజకవర్గంలో మాఫీ మొత్తం రూ.108,97,16,863
- నాడు డ్వాక్రా రుణాల మాఫీ అంటూ చంద్రబాబు మోసం
- నేడు రుణమాఫీ పూర్తిగా చేసిన సీఎం జగన్
- నాలుగో విడత ఆసరా సదస్సులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న మహిళలు, ప్రజాప్రతినిధులు

చిన్నమండెం : వైఎస్సార్ ఆసరా.. పొదుపు సంఘాలకు బాసటగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. చిన్నమండెంలో శనివారం జరిగిన మండల వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సదస్సులో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. గత ఎన్నికల సమయానికి ఉన్న డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. నేటికి సంపూర్ణంగా ఆ హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా రాయచోటి నియోజకవర్గంలో నాలుగు విడతల్లో రూ.108,97,16,863 మాఫీ అయిందన్నారు. చిన్నమండెం మండలంలో వైఎస్సార్ నాలుగో విడత కింద 524 సంఘాలకు రూ.3.75 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. నాలుగు విడతల ద్వారా చిన్నమండెం మండలంలోనే సుమారు రూ.15 కోట్లకు పైగా లబ్ధి జరిగిందన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి పొందడం జరుగుతోందని అన్నారు. నియోజకవర్గంలో 20 వేలకు పైగా పక్కా గృహాలు మంజూరు అయ్యాయని, 93 జగనన్న కాలనీలు నిర్మితమవుతున్నాయన్నారు. చంద్రబాబు పదిహేనేళ్ల పాలనలో చెప్పుకొనేందుకు శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో అమ్మ ఒడి, విద్యాదీవెన, నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, జగనన్న కాలనీలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయన్నారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

ప్రతిపక్ష పార్టీలు, పచ్చ మీడియా దుష్ప్రచారాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. వారు మూకుమ్మడిగా కలిసి సత్యాలను అసత్యాలుగా, నిజాలను అబద్ధాలుగా మార్చడంలో సిద్ధహస్తులన్నారు. జగన్ వైపు ధర్మం, న్యాయం ఉన్నాయని, సీఎం జగన్‌కు ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. జగన్‌ను మళ్లీ సీఎం అయ్యేందుకు ఆశీర్వదించాలని కోరారు.

99 శాతం హామీలు నెరవేర్చిన జగన్

1998 మహానాడులో ఎన్నో హామీలను గుప్పించి 1999లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు చెప్పిన హామీలను నెరవేర్చలేదన్నారు. 2013–2024లో చెప్పిన హామీలను చంద్రబాబు అమలు చేయలేదన్నారు. అదే వైఎస్ జగన్ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నాలుగేళ్ల పాలనా కాలంలో 99 శాతం నెరవేర్చి మాట మీద నిలబడే వ్యక్తిగా పేరొందారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల మ్యానిఫెస్టోను ఆన్‌లైన్‌లో లేకుండా చేసిన చరిత్ర వారిదేనన్నారు. డ్వాక్రా మహిళలను, రైతులను అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులు వచ్చినా చెప్పిన సమయానికి కన్నా ముందుగానే సంక్షేమ పథకాలను అందించి ప్రజల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ తోడ్పాటు అందిస్తున్నారన్నారు.

కరోనా సమయంలో ఎక్కడికి పోయారో?

ఎన్నికలు సమీపిస్తున్నందున ఇప్పుడు అవి చేస్తాం, ఇవి చేస్తామని చెప్పేవాళ్లు.. కరోనా వేళ ప్రజల ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. ఆ సమయంలో తాము కరోనా బాధితులను కోవిడ్ ఆసుపత్రులకు వెళ్లి తోడుగా నిలిచామని, రూ.30 లక్షల సొంత డబ్బులతో ఆనందయ్య మందును ఉచితంగా నియోజకవర్గాల్లో ఇంటింటికీ అందజేశామన్నారు.

సేవకుడిగా ఉంటా

జగన్ పాలనలో పేదరికం తగ్గిందన్నారు. డ్వాక్రా సంఘాల బలోపేతానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల డ్వాక్రా సంఘాల ఏ, బీ గ్రేడులు 90 శాతానికి పైగా చేరాయన్నారు. ప్రజల కష్టసుఖాలలో మీ బిడ్డగా, తమ్ముడిగా, అన్నగా, ఒక సేవకుడిగా, కుటుంబ సభ్యుడి వలె తోడుంటానని తెలిపారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవకే తన జీవితం అంకితమని పేర్కొన్నారు.

మరోసారి ఆశీర్వదించాలి

జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలన జనరంజకంగా సాగుతోందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వైఎస్సార్ ఆసరా నాలుగో విడతలో చిన్నమండెం మండలంలోని 524 సంఘాలకు రూ.3.75 కోట్ల విలువ చేసే మెగా చెక్‌ను ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి అందజేశారు. సదస్సుకు మండలంలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభ

ముఖ్యమంత్రి జగనన్న తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని, వారి మేలు మరువలేమంటూ.. డ్వాక్రా అక్కచెల్లెమ్మలు జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జై జగనన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎంపీడీఓ దివ్య, ఏసీ శ్రీనివాసులురెడ్డి, ఏపీఎం రెడ్డమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ అంజనప్ప, వైస్ ఎంపీపీ ఏజాస్ ఆలీఖాన్, ఎంపీటీసీలు రమేష్, శ్యామ్, వెంకటప్పనాయుడు, రమణ, గంగులయ్య, రెడ్డప్ప, కోఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, సర్పంచులు మునల్‌రెడ్డి, నజీర్‌అహ్మద్, జగన్నాథరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, అఫ్రోజ్, సుధాకర్, షారుల్లా, బురాన్‌ఖాన్, సిబకతుల్లాఖాన్, అజ్రు, అన్వర్, మాజీ సర్పంచ్ అమ్మాజీ, గురివిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహమ్మద్‌షరీఫ్, సాయిపీర్, ఫయాజ్, విశ్వనాథరెడ్డి, నరేష్‌నాయుడు, సాదిక్, ఖదీర్, సజాద్, జహీర్, జయశంకర్‌రెడ్డి, రెడ్డిబాబు, చంద్రపాల్, యహియాఖాన్, చంద్రారెడ్డి, రామాంజులురెడ్డి, రమణ, శేషారెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు ప్రభుత్వ విప్ పుల్లంపేటకు రాక

పుల్లంపేట : పుల్లంపేటకు సోమవారం రైల్వేకోడూరు శాసన సభ్యులు, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు రానున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. కావున ప్రజలు, అధికారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

సీఐగా పదోన్నతి



శ్రీకాంత్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి శనివారం సీఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయనకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎస్‌ఐగా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ.. వివాదరహితుడిగా ప్రజల మన్ననలు పొందారు. మండలంలో శాంతి భద్రతలను కాపాడుతూ మంచిపేరు తెచ్చుకున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గ అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన గతంలో కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో కూడా ఎస్‌ఐగా పని చేశారు. శనివారం కర్నూలు జిల్లా డీజీపీ కార్యాలయంలో ఆయన సీఐగా పదోన్నతి ఉత్తర్వులు తీసుకోవడం జరిగింది.

రోడ్డు ప్రారంభం



రోడ్డును ప్రారంభిస్తున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీ 1, 2, 3 వీధులలో రోడ్డును చిత్తూరు జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా వీధుల చివరిలో ఉన్న ఇళ్లకు రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులు రూ.3 లక్షలతో మట్టిరోడ్డు పనులు చేయించి ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజలు ఆయన్ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటిమిట్టలో పత్తికొండ ఎమ్మెల్యే

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవాలయాన్ని కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అర్చకులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ గావించారు. అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయ రంగ మండలంలో సేదతీరి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెనగలూరు ఎస్‌ఐ బదిలీ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు ఎస్‌ఐ సుబ్బారెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. పెనగలూరు పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐను ఇంతవరకు నియమించకపోవడంతో.. స్టేషన్‌లో ఉన్న ఏఎస్‌ఐ మల్లికార్జున ఇన్‌చార్జి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న వాహనాల తనిఖీ అధికారులు

రాయచోటి టౌన్ : 35వ జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా రాయచోటి వాహనాల తనిఖీ అధికారులు (వాక్‌థాన్) ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి జెండాను ఊపి ప్రారంభించారు. శనివారం రాయచోటిలోని చెక్ పోస్టు వద్ద రోడ్డు భద్రత, గాలికాలుష్యం విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్లకార్డులతో విద్యార్థులు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చెక్ పోస్టు వద్ద నుంచి బంగ్లా, ఠాణా, ఆర్టీసీ బస్టాండ్, వైఎస్సార్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాయచోటి వాహనాల తనిఖీ అధికారి సుబ్బరాయుడు, ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్ రాజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


శుద్ధి జలం అందించడమే లక్ష్యం



శుద్ధి జలం ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీపీఓ జిల్లా సుదర్శన్‌రెడ్డి

గాలివీడు : గ్రామాల్లో శుద్ధి జలం అందించడమే లక్ష్యమని డీపీఓ జిల్లా సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం గరుగుపల్లె గ్రామంలో శుద్ధి జలం ప్లాంట్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతంరెడ్డి జానమ్మ, రామాంజులురెడ్డి, గుండ్లచెరువు సర్పంచ్ ఉమాప్రభాకర్, మాజీ ఎంపీపీ చిన్నరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భానుమూర్తిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్ శివగంగాధర్, బీసీ నాయకులు నాగేశ్వర్‌నాయుడు, వెంకటనారాయణ, సిద్ధయ్య, సుధాకర్, మైనార్టీ నాయకులు రహమాన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలి



గెలుపొందిన కబడ్డీ క్రీడాకారులకు కప్ అందిస్తున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట టౌన్ : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆర్డీఓ రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. కబడ్డీ పోటీల్లో నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ క్రీడాకారులకు శనివారం ఆర్డీఓ కప్, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాజట్టుకు ప్రభుత్వం రూ.35 వేలు నగదు బహుమతిని అందిస్తుందని, విజేతల జట్టుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగదు బహుమతిని వారికి అందే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల రాజంపేట ఇన్‌చార్జి ఎస్.షామీర్‌బాషా, సర్వేయర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక శక్తిని వెలికి తీయాలి



జడ్జి శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అన్నారు. మండలంలోని ఆడపూరు అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తరువాత ఏయే కోర్సులు ఉన్నాయి, అందులో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల సిబ్బంది జడ్జి శంకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు హేమ, సునీత, అనీత, నలోమి, ప్రతిభ, భారతి, వాణి, మహేశ్వరి, శివపార్వతి, విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ

రాజంపేట రూరల్ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) వారు విశాఖపట్టణం నుంచి విద్యుత్ వినియోగదారుల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 29, 30, 31వ తేదీలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడదలచిన వారు డివిజనల్ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవల్సిందిగా కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వనాథరెడ్డి

రాయచోటి అర్బన్ : రాష్ట్ర విభజనకు ముందున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వై.విశ్వనాథరెడ్డి శనివారం డీఎంహెచ్‌ఓ కొండయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్: 114ను వెంటనే అమలు చేయాలన్నారు. ఏపీ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి చేసిన ఏపీ రెగ్యులైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ఆఫ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యాక్ట్‌ను ఉల్లంఘించకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రాడ్యుయేట్ ఫార్మసిస్టుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ యం.సిద్ధయ్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

చిట్వేలి : అసాంఘిక కార్యకలాపాలు, ముఖ్యంగా బెల్టుషాపులల నిర్వహణపై ఉక్కుపాదం మోపుతున్నట్లు రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం చిట్వేలి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బంది పనితీరు, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో సీఐ మాట్లాడారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే ఎన్నికల సందర్భంగా గ్రామాలలో అలజడులు సృష్టించే వారి పట్ల ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్‌ఐను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్, హెచ్‌సీ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక భూములు సర్వే చేయండి



తహసీల్దార్ పుల్లారెడ్డితో మాట్లాడుతున్న సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలో రైతులకు సంబంధించిన సమస్యాత్మకమైన భూములు సర్వే చేయించి పరిష్కారం చూపాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ పుల్లారెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసర్వే కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ సర్వే చేయించాలని అన్నారు. గాదెల వెంకటాపురం, చెన్నరాజుపోడు తదితర గ్రామాల రైతులు తమ భూముల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ.. క్షేత్ర స్థాయిలో భూములు, రికార్డులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సదాస్వామి, సర్వేయర్ భవానీ, మండల కో–ఆప్షన్ మెంబర్ మౌలానా, ఎంపీటీసీ నరసింహులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమాశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన సంక్షేమం.. జగనన్న లక్ష్యం



ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



అధిక సంఖ్యలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

- డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ
- నియోజకవర్గానికి రూ.120 కోట్ల కేటాయింపు
- ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మండల వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఆసరా కోసం రూ.25 వేల కోట్లు వెచ్చించారని పేర్కొన్నారు. జగనన్న మహిళల పేరుతోనే ఎక్కువ పథకాలు అమలు చేశారన్నారు. కరోనా సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి అమోఘమని అన్నారు. 79 లక్షల మందికి ఆసరా కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు ఇచ్చిన నాయకుడు మన జగనన్న అని అన్నారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంగ్లిషు మీడియం ఎంతో ముఖ్యమని గ్రహించి.. ప్రాథమిక పాఠశాల నుంచి ప్రవేశపెట్టి పేద ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించడం గొప్ప విషయమన్నారు. కావున ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉండాలని కోరారు. పెనగలూరు మండలానికి ఆసరా కింద నాలుగు విడతలలో రూ.15 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలో 120 కోట్లు ఆసరా కింద మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం రుణమాఫీ మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. తరువాత సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉండి, అత్యధిక మెజార్టీతో సీఎంగా గెలిపిస్తే ఈ పథకాలన్నీ తిరిగి కొనసాగుతాయన్నారు. అంతకు ముందు మండల ఉపాధ్యక్షుడు కొండూరు విజయ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్నను ఆశీర్వదించి అత్యధిక మెజారీతో గెలిపించాలన్నారు. అలాగే కొరముట్ల శ్రీనివాసులను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందరికీ పంచి పెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఏరియా కో–ఆర్డినేటర్ నిరంజన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు ఆరోగ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె): ప్రకృతి వ్యవసాయంతో ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అందించిన కూరగాయలు, ఇతర పప్పు ధాన్యాలను ప్రదర్శనకు పెట్టారు. ఆహార ఉత్పత్తులను ఎమ్మెల్యే కొరముట్ల పరిశీలించి ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేసినట్లయితే మన దేశం ఆరోగ్యవంతమైన దేశంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ సిద్ధయ్య, యూనిట్ ఇన్‌చార్జ్ లక్ష్మీదేవి, శైలజ, వరలక్ష్మి, మల్లేశ్వరీ, బాగ్యమ్మ, రాధ, బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సభను విజయవంతం చేయండి

గాలివీడు : స్థానిక రాయచోటి రోడ్డు మార్గంలోని మోహన్‌రెడ్డి వసతి గృహంలో ఆదివారం నిర్వహించే వైఎస్సార్ ఆసరా సభను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శేఖర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమానికి రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నైతిక విలువలు నేర్పించాలి

చిట్వేలి : పిల్లలకు చిన్నతనం నుంచి నైతిక విలువలను, సమాజ సేవాభావాన్ని అలవరుచుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని ఉమ్మడి కడప జిల్లా మానవతా అధ్యక్షులు ఎస్‌వీ రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని నిరుపేద, అనాథ విద్యార్థి సాధిక్‌కు రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్రారెడ్డి జిల్లా శాఖల పరిధిలోని నిరుపేదలకు, అనారోగ్యంతో ఉన్న వారికి రూ.5 వేలు ఆర్థిక సాయం చేయాలని చేసిన సూచన మేరకు ఈ ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా మానవతా ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, రాజంపేట అధ్యక్షులు అబ్దుల్లా, బాధ్యులు సాయిరాం, మునిరావు, వెంకటరెడ్డి, గౌరవ డైరెక్టర్ బోర్డు సభ్యులు విశ్వనాథం, రంగారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన

సిద్ధవటం : మహిళలు పోష్ యాక్టును సద్వినియోగం చేసుకోవాలని సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకల్యాణ్ తెలిపారు. సిద్ధవటం గ్రామ శివారులో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం పోష్ యాక్టుపై మహిళలు, మండల స్థాయి అధికారులకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురి చేస్తే.. అలాంటి వారిపై పోష్ యాక్టు ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి, ఎంఈఓ శంకరయ్య, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, పోలీసులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



యువకులకు నగదు అందిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు : యువకులు ఆట పోటీల్లో ఉత్సాహంతో, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు రావాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెంకటరెడ్డిపల్లె అరుంధతివాడ, తిమ్మిశెట్టిపల్లె, రెడ్డివారిపల్లె, కంభ్రిగ గ్రామాలలోని యువకులకు క్రికెట్ కిట్ల కోసం తన సొంత డబ్బులు రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరిక్రిష్ణారెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



కుసుమమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లెలోని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, దివంగత గాలివీటి రామకృష్ణారెడ్డి భార్య మాజీ సర్పంచ్ గాలివీటి కుసుమమ్మ దశదిన కర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాలివీటి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాలివీటి విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, రాజంపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు మదన్‌రెడ్డి (విజయ సాగర్‌రెడ్డి) సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గౌరవనీయశ్రీ రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు.
I.P No: 11/2023
1. బోనాల [illegible] w/o బోనాల [illegible].
2. బోనాల [illegible] s/o బోనాల [illegible],
[illegible] డోర్ నంబరు 6/828-3 A,
[illegible], రాజంపేట టౌన్ మరియు మండల్,
అన్నమయ్య జిల్లా...... పిటీషనర్లు/ ఐ.పి.పిటీషనర్లు.
Vs
1. షేక్ [illegible] s/o [illegible], (R4)
D.No: 1/24, [illegible], రాజంపేట టౌన్ మరియు మండలము, అన్నమయ్య జిల్లా.
2. షేక్ [illegible] s/o [illegible], (R5)
D.No: 5/162, [illegible], [illegible] సెంటర్ దగ్గర, పాత [illegible], రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.
3. [illegible] w/o [illegible], (R6)
D.No: 6/828-3, A B.S నగర్, రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.
4. సుబ్బారాయుడు s/o నారాయణ, (R8)
D.No: 6/48, [illegible] వాటర్ ట్యాంక్ దగ్గర, రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.
5. [illegible] s/o [illegible], (R9) D.No: 4/253, B.S.[illegible], రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.
6. [illegible] w/o not known, (R11) [illegible], రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.
7. [illegible] w/o [illegible] రెడ్డి, (R12) [illegible], D.No: 5/71, B.S.[illegible], రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.
8. [illegible] w/o N.[illegible], (R15)
D.No: 5/21A [illegible] రోడ్, [illegible] దగ్గర, రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.
9. షేక్ [illegible] s/o తెలియదు, (R17)
D.No: 4/45-A-B, [illegible], రాజంపేట టౌన్ మరియు మండల్, అన్నమయ్య జిల్లా.................. 4 to 6,8,9,11,12,15 & 17 రెస్పాండెంట్లు.
నోటీసు
పై నెంబరులోని పిటీషన్లు, పై కనుక రెస్పాండెంట్లపై I.P దాఖలు చేసి ఉన్నారు కావున మీరు పై కోర్టు నందు 01-02-2024 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో మీ గైర్హాజరులో [illegible] అని తెలియజేయడమైనది.
బై ఆర్డర్ ఆఫ్ ద కోర్ట్
[illegible] B.A., LL.B
అడ్వకేట్, రాజంపేట, అన్నమయ్య జిల్లా.